క్లుప్తంగా

వేగవంతంగా రీ సర్వే పనులు



నందిగామ: రీ సర్వే పనులు మరింత వేగవంతం చేయాలని ఆర్డీవో రవీంద్రరావు సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పలు శాఖల అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇల్లు, రీ సర్వే, రెవెన్యూ సమస్యలు, స్పందన అర్జీలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశించిన సమయంలో రీ సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా గృహ నిర్మాణాలు మరింత వేగవంతమయ్యేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా స్పందన ద్వారా వచ్చే అర్జీలను స్వీకరించిన వెంటనే విచారణ జరిపి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ, హౌసింగ్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల అందజేత



వత్సవాయి: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని పాఠశాల పూర్వ విద్యార్థి గుత్తా కృష్ణమూర్తి అన్నారు. భార్య సుశీల జ్ఞాపకార్థం లక్ష రూపాయల విలువైన డైరీలు, కాపీ పుస్తకాలు, మెరిట్ స్కాలర్‌షిప్పులను శుక్రవారం పాఠశాల విద్యార్థులకు అందజేశారు. గతంలో రూ.20 లక్షలతో పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనువుగా కళావేదికను నిర్మించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆర్. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, హైదరాబాద్ ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ప్రముఖులను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, చైర్మన్ రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. విజయవాడకు చెందిన ఎంవీఎస్ఎస్ఆర్ చంద్రిక బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన కూచిపూడి నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

ఫైర్ స్టేషన్ తనిఖీ

ఆటోనగర్ (విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని అగ్ని మాపక కేంద్రాన్ని రీజనల్ ఆఫీసర్ ఈ. స్వామి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పరికరాలను, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కృష్ణాజిల్లా కంకిపాడులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో గతం కన్నా 20 శాతం ప్రమాదాలు తగ్గాయన్నారు. ఈ ఆరు నెలల కాలంలో 1356 ఫోన్ కాల్స్ వచ్చాయన్నారు. రూ.13.58 కోట్లు ఆస్తిని కాపాడినట్లు చెప్పారు. నష్టం రూ.6.6 కోట్లు అని ఆయన చెప్పారు. ఏలూరు, కంకిపాడు, రాజమండ్రితోపాటు భీమవరంలో ఒక్కొక్క అగ్నిమాపక కేంద్రాన్ని రూ. 5కోట్లతో నిర్మించనున్నట్లు చెప్పారు. అనంతరం సిబ్బందికి బూట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి నరేష్, సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి అందాల ఆధ్యాత్మిక కేంద్రం

- గ్రామం మధ్యలో ఎత్తయిన రాతి కొండ
- కొండపై ఆకట్టుకుంటున్న ఆలయాలు



జుజ్జూరు గ్రామ కొండ వ్యూ



కొండపై ఉన్న పలు ఆలయాలు

నందిగామ: నియోజకవర్గం పరిధిలోని వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామం ప్రకృతి అందాల ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. గ్రామం మధ్యలో ఉన్న ఎత్తైన రాతి కొండ చూసేందుకు ఎంతో అందంగా కనిపిస్తుంది. ఆ కొండపై పలు రకాల ఆలయాలు దర్శనమిస్తాయి. ముఖ్యంగా కొండపై ఉన్న కోనేరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. జుత్తూరు గ్రామం మధ్యలో ఎంతో విశాలమైన, ఎత్తయిన రాతి కొండ ఉంది. ఆ కొండపై అనేక రకాల చెట్లు దర్శనమిస్తాయి. కొండపైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన వందల సంవత్సరాల నాటి మెట్లు నేటికీ చెక్కుచెదరలేదు. ముఖ్యంగా అనేక రూపాల్లో దర్శనమిస్తున్న రాతి శిలలు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఎంతో విశాలమైన ఆ కొండపైకి వెళ్తే ప్రకృతి ప్రేమికులకు సమయం కూడా తెలియదు.

మహిమగల కోనేరు...

జుజ్జూరు గ్రామంలోని కొండపై అచ్చం మత్స్య (చాప) రూపంలో కోనేరు ఉంది. ఆ కోనేరులోకి నీళ్లు ఎక్కడ నుంచి వస్తాయో తెలియదు కానీ ఏ కాలంలో నైనా స్వచ్ఛమైన నీరు కన్పిస్తుంది. ముఖ్యంగా వేసవికాలంలో సైతం కోనేరులో నీరు పుష్కలంగా ఉంటుంది. ప్రత్యేకంగా ఆ నీటిని కొండపైన ఆలయాల్లో అభిషేకానికి వినియోగిస్తారు.

ఆకట్టుకుంటున్న పలు ఆలయాలు...

జుజ్జూరు కొండపై గల పలు ఆలయాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా 1108 లో జుజ్జయ మహారాజు కొండ దిగువ భాగంలో పార్వతీ సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయాన్ని నిర్మించారు. ఆ పురాతన ఆలయం నేటికీ చెక్కుచెదరలేదు. అదేవిధంగా కొండపై గృహలో రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం ఉంది. వీటితోపాటు కొండపైన అచ్చం అన్నవరంలో మాదిరిగానే నిర్మించిన అనంతలక్ష్మి సమేత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయం ఉంది. అరుదుగా కనిపించే ఆలయాల్లో ఒకటైన ధన్వంతరి స్వామివారి ఆలయం ఈ కొండపై ఉంది. అనేక ప్రాంతాల నుంచి అనారోగ్యంతో ఉన్నవారు వచ్చి ఇక్కడ పూజలు చేసుకొని వెళుతుంటారు. వీటితో పాటు కొండ దిగువ భాగంలో దత్తాత్రేయ స్వామి వారి ఆలయం కూడా ఉంది. ఈ గ్రామంలో ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు తిరునాళ్ల మహోత్సవాలు జరుగుతాయి. ఈ తిరుణాల మహోత్సవాలకు అనేక ప్రాంతాల నుంచి లక్షలాదిమంది భక్తులు వచ్చి వెళుతుంటారని స్థానికులు చెబుతున్నారు.

అభివృద్ధి పథంలో గ్రామీణ ప్రాంతాలు

గడప గడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు):ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించటంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయిన్‌లను ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధిలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జవాబుదారీ పాలన అందిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటన్నింటిని అధికారులతో చర్చించి ప్రాధాన్యతక్రమంలో పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా, నాయకులు రమావత్ రాము, షేక్ జయాలుద్దిన్, పలువురు నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లు అందిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మహనీయుల బాటలో నడుచుకోవాలి

కంచికచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నా భూమి- నా దేశం- వీరులకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మోగులూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య కోసం పోరాడిన మహనీయుల బాటలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని కోరారు. మహనీయుల చరిత్రపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా గ్రామ సచివాలం వద్ద శిలాఫలకం ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేసి కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత గురువులతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఆవల సామ్రాజ్యం, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఎంఈఓ బి.బాలాజీ, ఏపీఓ రమాదేవి, హెచ్‌ఎం సుందరరావు, సీఆర్పీలు బంకా బడేమియా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశం కోసం మంచి పని చేయాలి

నందిగామ: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నందిగామ మున్సిపాలిటీ పరిధిలో అధికారులు శుక్రవారం ప్రత్యేక శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. నాభూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా 12వ వార్డులో ఈ శిలాఫలకాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశం కోసం మంచి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగానే నందిగామ మున్సిపాలిటీ పరిధిలో కూడా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పలు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి..

పెనుగంచిప్రోలు: స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను మరువరాదని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. నా భూమి-నాదేశం, వీరులకు వందనం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం వెంకటాపురం, వెంగనాయకునిపాలెం, శనగపాడు గ్రామాల్లో శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో వెంకటాపురం, వెంగనాయకునిపాలెం, శనగపాడు గ్రామ సర్పంచ్‌లు కూచి వెంకటనర్సయ్య, నరసింహారావు, కీసర సైదులు, ఎంపీటీసీ కీసర లోకేశ్వరరావు, ఏపీఓ తిరుపతయ్య, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మోగులూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ మల్లికార్జునరావు తదితరులు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు ఏర్పాటు చేయాలి

కేంద్ర రైల్వే మంత్రికి ప్రభుత్వ విప్ ఉదయభాను వినతి


జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు నడపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని శ్రీవైష్ణవ్‌ను రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డితో కలిసి శుక్రవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్ కమిటీలో వినతిపత్రం అందజేశారు. ఉదయభాను మాట్లాడుతూ మోటమర్రి-జగ్గయ్యపేట-సికింద్రాబాద్ గూడ్స్ రూటును ప్యాసింజర్ రూటుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ-సికింద్రాబాద్ మధ్య ఉన్న గూడ్స్ రైళ్లు వెళ్లే మార్గంలో ప్యాసింజర్ రైళ్లు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత 30 ఏళ్లుగా జగ్గయ్యపేట గూడ్స్ రైల్వే స్టేషన్ నుంచి రైల్వే శాఖకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తోందన్నారు. ప్యాసింజర్ లైను ఉన్నప్పటికీ రైలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రస్తుతం విజయవాడ, మధిర, కొండపల్లి, కాజీపేట, ఖమ్మం మీదుగా సికింద్రాబాద్ వెళుతున్నాయని, మోటమర్రి-జగ్గయ్యపేట-సికింద్రాబాద్ గూడ్స్ రూటును ప్యాసింజర్ రూటుగా మారిస్తే జగ్గయ్యపేట ప్రాంతంతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, సమయం, దూరం తగ్గుతుందని వివరించారు. ఈ విషయంపై రైల్వే మంత్రి స్పందిస్తూ దేశ వ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించామని, ప్యాసింజర్ రైలు జగ్గయ్యపేటకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



రైల్వే శాఖ మంత్రి అశ్విని శ్రీవైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, చిత్రంలో రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి

స్వచ్ఛం.. సుందరం

స్వచ్ఛతే లక్ష్యంగా వీఎంసీ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరిస్తుండగా.. ఇంకా కొంతమంది నగరంలోని కాలువల్లో చెత్తను పడేస్తుండంతో కాలువలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. దీంతో మిషన్ ఫర్ క్లీన్ కెనాల్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కాలువల గోడలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు మైక్ ద్వారా ప్రచారం, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే కాలువల్లో ఎవరినీ చెత్త వేయనీయకుండా వీఎంసీ కార్మికుడిని కాపలాగా పెడుతోంది వీఎంసీ. దీంతో కాలువల్లోకి చెత్త చేరడం లేదు. ప్రవాహానికి ఆటంకాలు లేకుండా శివారు ప్రాంతాలకు సైతం తాగు, సాగునీరు అందుతోంది. –సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ



స్వచ్ఛ కాలువ.. ఆటంకాలు లేకుండా ప్రవహిస్తున్న ఏలూరు కాలువ



నిరంతర నిఘా.. ఏలూరు కాలువ వద్ద ఏర్పాటు చేసిన మైక్ సీసీ టీవీ



వేశారో విజిల్ వేస్తా.. రైవస్ కాలువ వద్ద విధులు నిర్వర్తిస్తున్న వీఎంసీ కార్మికుడు



రక్షణ కవచం.. బుడమేరు కాలువ వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న కార్మికులు

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలను కేంద్ర ప్రభుత్వం నివారించి అక్కడ శాంతిని నెలకొల్పాలని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు కోరారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్ యాజమాన్య సంస్థ డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మణిపూర్‌లో జరిగిన ఘటనల్లో మృతి చెందినవారికి నివాళులర్పించారు. తొలుత హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రెసిడెంట్ ఆర్. సత్యనారాయణ మాట్లాడుతూ మణిపూర్‌లో చోటుచేసుకుంటున్న దురదృష్టకర సంఘటనలకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఆర్. గోపాలం, సెక్రటరీ ఎం. నరసింహారావు, ట్రెజరర్ డి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రధాన రోడ్లలో దోమల నివారణకు మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం వారు చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సూచనలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.దుర్గాప్రసాద్ శుక్రవారం దోమల నివారణ మందు ఫాగింగ్ చేయించారు. శనివారం నుంచి వార్డుల్లో ఫాగింగ్ జరుగుతుందని దుర్గాప్రసాద్ చెప్పారు.

ఐదు నామినేషన్ల ఆమోదం

వీరులపాడు:మండలంలోని దాచవరం గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించిన ఐదు నామినేషన్‌లను ఆమోదించినట్లు ఎన్నికల అధికారి మల్లెల ఝాన్సీరాణి తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో శుక్రవారం నామినేషన్‌ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గద్దె వెంకటేశ్వర్లు, తోట రవి, కామిశెట్టి వెంకటేశ్వరరావుతో పాటు మరో ఇద్దరు నామినేషన్‌లను ఖరారు చేశామని తెలిపారు.

తిరుపతమ్మ ఆలయం కిటకిట



కోలాటమాడుతున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మ ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వినుకొండ పట్టణానికి చెందిన భక్తుల కోలాటమాడారు. భక్తుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

మిల్లెట్స్‌తో ఆరోగ్యకర జీవితం



మిల్లెట్స్‌తో వంటకాలను ప్రారంభిస్తున్న డాక్టర్ శేఖర్‌బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పూర్వీకులు మిల్లెట్స్ ఆహారాన్ని తీసుకుని ఎంతో ఆరోగ్యంగా ఉండేవారని, మిల్లెట్స్‌పై ఆధారపడేవారి జీవిత కాలం పెరుగుతుందని ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ/వీసీ డాక్టర్ శేఖర్‌బాబు గెడ్డం పేర్కొన్నారు. భారత్ వికాస్ పరిషత్ మహిళా విభాగం మూడు బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం 'మిల్లెట్స్‌తో మగువలు' పేరుతో నిర్వహించిన మిల్లెట్స్ కుకింగ్ కాంపిటీషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు. మిల్లెట్స్‌ను పండించే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను అందిస్తుందని చెప్పారు. త్వరలోనే 'మిల్లెట్స్‌తో మగవారు' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీవీపీ అమరావతి ప్రాంత ప్రెసిడెంట్ షా రూప్‌చంద్ జైన్, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ మిత్తింటి శారద, ఆంధ్రహాస్పటల్ న్యూట్రిషన్/డైటీషియన్ డాక్టర్ జీ స్వరూప పాల్గొన్నారు. ఈ పోటీలో సమత, శ్వేత భన్సాలీ, కొల్లా కార్తీక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. భరణి మహాలక్ష్మి, కె ధనలక్ష్మి కన్సొలేషన్ బహుమతులు పొందారు.

గేమ్ డెవలప్‌మెంట్‌పై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు గేమింగ్ డెవలప్‌మెంట్‌పై పట్టు సాధించాలని ప్రముఖ గేమింగ్ డిజైనర్ సి. సతీష్‌కుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గేమింగ్ డెవలప్‌మెంట్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. యూనిటీ యాప్ ద్వారా గేమ్ డెవలప్‌మెంట్ చేయటానికి చక్కని అవకాశాలు ఉన్నాయన్నారు.